మిషన్ భగీరథ జాడేది?

- అలంకారప్రాయంగా వాటర్ ట్యాంకులు, నల్లాలు
- సురక్షిత తాగునీరు లేక ఇబ్బందుల్లో ప్రజలు
- పనులు మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు

రామగిరి: మిషన్ భగీరథ పనులు మండలంలో ఏ గ్రామంలోనూ పూర్తి కాలేదు. దీంతో గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. ఒకవేళ వచ్చినా గ్రామ పంచాయతీ ట్యాంకులకు నీటిని ఎక్కించి అంతకు ముందు ఉన్న పంచాయతీ పైపులైన్ ద్వారానే వదులుతున్నారు. ఇది కొన్ని గ్రామాల్లోనే జరుగుతుంది. ప్రతి ఇంటికీ గ్రామ పంచాయతీ నల్ల నీటితో పాటు ప్రజల ఆరోగ్య రీత్యా స్వచ్ఛమైన నీరు అందించాలని ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. గోదావరి నీటిని ఫిల్టర్ చేసి పైపుల ద్వారా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. ఇంటింటికీ ఒక భగీరథ నల్లా బిగించినప్పటికీ వాటికి ఇప్పటి వరకూ కనెక్షన్ ఇవ్వకపోవడం గమనార్హం.

పనులు మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు



కల్వచర్లలో అలంకారప్రాయంగా ట్యాంకు

మండలంలోని అన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లు మిషన్ భగీరథ పనులు చేపట్టారు. కానీ ఏ గ్రామంలోనూ పూర్తి చేయలేదు. కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల గుంతలు తీసి, మరి కొన్ని గ్రామాల్లో సగం వరకు పైపులు వేసి వదిలేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో సురక్షిత తాగు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇంటి ముందు నీటి కనెక్షన్ లేని నల్లా

పనులు పూర్తయ్యేదెన్నడో?

భగీరథ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం విధించిన గడువు ముగిసినా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సంపుల నిర్మాణం, బ్యాలెన్సింగ్ పనులపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ పనులు పూర్తి కాలేదు. పైపులైన్ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మిషన్ భగీరథ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తేనే నిరంతరం నీటి సరఫరాకు అడ్డంకులు తొలగుతాయి.

ఇప్పటివరకు నీరు రాలేదు



మిషన్ భగీరథ నీరు ఇప్పటి వరకు మాకు రాలేదు. మా గ్రామంలో ఇప్పటి వరకు భగీరథ పనులు పూర్తి కాలేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రతి ఇంటికి నీరు వచ్చేలా చూడాలి.

– యాట భూమేష్, కల్వచర్ల

ఎన్నోసార్లు విన్నవించాం



గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. బస్టాండ్ ఏరియాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గతంలోనే అధికారులకు తెలిపినా చర్యలు శూన్యం. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– గంట పద్మ, సర్పంచ్, కల్వచర్ల

క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

పాలకుర్తి: బసంత్‌నగర్ ఆలీవర్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పల్లె ఆకాష్ 800 మీటర్ల రన్నింగ్‌లో మొదటి బహుమతి, సంజన, కార్తిప్రియన్ డిస్కత్రోలో రెండో బహుమతి సాధించినట్లు పాఠశాల పీఈటీ అంకిత్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జాఫర్‌బేగ్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జీజీహెచ్ ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మగువ ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలో పేషెంట్ల బంధువులకు రామగుండం లయన్స్ క్లబ్ మగువ జోన్ చైర్‌పర్సన్ సోమారపు లావణ్య బుధవారం అన్నదానం చేశారు. తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. క్లబ్ ప్రతినిధులు డాక్టర్ లక్ష్మీవాణి, గాలి సునీత, శశికళ, సుజాత, లావణ్య, మంజుల, శ్వేత, లక్ష్మి, స్వర్ణలత, బంక రామస్వామి ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన మడ్డి కొమురయ్యను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కొమురయ్య సుల్తానాబాద్‌లోని బాలుర పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కొమురయ్య సేవలు మరువలేనివన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల రేవతి, పొన్నం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపోటీల్లో కొలనూర్ విద్యార్థుల ప్రతిభ

ఓదెల: పెద్దపల్లిలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండలంలోని కొలనూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. డిస్కస్‌త్రో విభాగంలో కె.అశ్విత, షాట్‌పుట్ విభాగంలో ఆర్.శ్రావ్య బంగారు పతకాలు సాధించారు. 1500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో జశ్వంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్పోర్ట్స్ అధికారి సురేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, పెట కార్యదర్శి సురేందర్, హెచ్‌ఎం ఏసుదాసు, పీఈటీ ప్రణయ్ అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

మొన్న ఎమ్మెల్యేతో.. నిన్న కాంగ్రెస్ కండువాతో!



మంగళవారం ఎమ్మెల్యేకు దట్టీ కడుతున్న సాదిక్



బుధవారం కాంగ్రెస్‌లో చేరుతున్న సాదిక్

రామగుండం: ఓటర్ల సిత్రవిచిత్రాలతో ప్రజాప్రతినిధులు ముక్కున వేలేసుకునే పరిస్థితి వచ్చింది. అక్బర్‌నగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రచారం చేసే క్రమంలో అక్బర్‌నగర్‌కు చెందిన ఎండీ.సాదిక్ అన్నీ తానై వ్యవహరించి ఎమ్మెల్యే చేతికి దట్టీ కట్టాడు. 24 గంటల్లోనే సదరు వ్యక్తి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయోధ్యసింగ్‌ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని కాంగ్రెస్ నాయకుడయ్యాడు. రెండు పార్టీల నాయకులు ఇతడి వైఖరిపై ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

కోల్‌సిటీ: గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన కాటిపెల్లి రాజ్‌కుమార్(38) అనే సింగరేణి ఉద్యోగి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా బుధవారం తోటి ఉద్యోగులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.30వేల నగదును రాజ్‌కుమార్ భార్యకు అందజేశారు. ఉద్యోగులు చిక్కుడు శ్రీనివాస్, గట్ల తిరుపతిరెడ్డి, అందె కళ్యాణ్‌వర్మ, మేజిక్ శేషి ఉన్నారు.



నగదు అందజేస్తున్న తోటి కార్మికులు

పార్లమెంట్ మీడియా కో–ఆర్డినేటర్‌గా శ్రీనివాస్



సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన కల్వల శ్రీనివాస్‌ను పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్లు ఏఐసీసీ తెలంగాణ ఎన్నికల కమ్యూనికేషన్ ఇన్‌చార్జి అజయ్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్‌లో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీమతి డోలి శర్మ, ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కల్వల శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

డొక్కు బస్సులు.. ప్రయాణికుల అవస్థలు



పెద్దపల్లిరూరల్: ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ బస్సులు కండిషన్‌లో లేకపోవడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. పెద్దపల్లి–మంథని నడుమ నడుస్తున్న బస్సు పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులంతా మరో బస్సు ఎక్కేందుకు ఇలా నడిరోడ్డుపై నిరీక్షిస్తూ కనిపించారు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపి కండిషన్ ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధికి సహకరించే వారికే మద్దతు

గోదావరిఖనిటౌన్: పద్మశాలీ సంఘాల అభివృద్ధికి సహకరించే అభ్యర్థులకే అసెంబ్లీ ఎన్నికల్లో సంఘం మద్దతు ఉంటుందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండారి రాజమల్లు, బూర్ల దామోదర్, సిరిమల్ల జయరాములు అన్నారు. నగరంలోని మార్కండేయకాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన రామగుండం పద్మశాలీ సేవా సంఘం, పోపా, మహిళా, యువజన సంఘాల మొదటి కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పద్మశాలీ సేవా సంఘం నేతృత్వంలో పద్మశాలీ సహకార సంఘాలను నెలకొల్పేందుకు రామగుండం పద్మశాలీ సేవా సంఘం సిద్ధంగా ఉందని, రాబోయే ప్రభుత్వాలు సంఘానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్డేపల్లి దినేశ్, చిప్ప లలితశ్రీ, మాటేటి మౌనిక, సతీశ్, బొద్దుల వేణు, సిరిపురం నర్సయ్య, అన్నల్‌దాస్ శ్రీనివాస్, సిరిపురం రమేశ్, సత్యం, శ్రీనివాస్, రవీందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఉపన్యాస పోటీలకు ఎంపిక

ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు 'మానవ జీవితంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో మొదటి స్థానం ఎలిగేడు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాహిత్య ఎంపికైనట్లు న్యాయ నిర్ణేతలు నవీన్ కుమార్, లావణ్య తెలిపారు.

మోడల్‌స్కూల్‌లో..

ఓదెల: ఓదెల మోడల్‌స్కూలులో విద్యార్థులకు బుధవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి అందించారు. కార్యక్రమంలో మోడల్ ప్రిన్సిపాల్ ఎండీ జావీద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఓటుహక్కుపై విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న నోడల్ అధికారి స్వరూపరాణి

కోల్‌సిటీ: ఎన్నికల అధికారులు స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతపై కళాజాత బృందాలతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరిఖని జవహర్‌నగర్, పర్శురాంనగర్, మహావీర్ యూత్, తిలక్‌నగర్, ఆటోస్టాండ్, వాటర్ ట్యాంక్ ఏరియా, భగత్‌సింగ్‌నగర్, ఆంధ్రాబ్యాంక్ ఏరియా, సంజీవ్‌నగర్, సీతానగర్, మార్కెట్ ఏరియా, బస్టాండ్ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గండ్ల స్వరూపరాణి, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 21వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామ్మోహనా చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.40 నిమిషాలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

ఆదాయ పన్ను మాఫీ చేస్తాం



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

- కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికుల ఆదాయపన్ను మాఫీ చేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. బుధవారం జీడీకే–5 ఓసీపీపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఫైవింక్లైన్ చౌరస్తా నుంచి జీడీకే–5 ఓసీపీ వరకు ఒగ్గుడోలు కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకుడు తిరుపతి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

జీడీకే–1వ గనికి చెందిన టీబీజీకేఎస్, హెచ్‌ఎంఎస్ నాయకులు బాలయ్య, సారయ్య, సర్దార్‌సింగ్, సంతోష్‌రెడ్డి, బద్రు, రాము, సమ్మిరెడ్డి కాంగ్రెస్‌లో చేరగా రాజ్‌ఠాకూర్ పార్టీలోకి ఆహ్వానించారు.

రామగుండంలో..

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడలోని రెడ్డి కులస్తులు డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పెద్దంపేట, సుభాష్‌నగర్ కాలనీవాసులు సైతం అయోధ్యసింగ్‌ఠాకూర్ సమక్షంలో పార్టీలో చేరారు.

మనాలీ ఠాకూర్ ప్రచారం

పాలకుర్తి: మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గెలుపు కోసం చేపట్టిన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని బసంత్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో పూజలు చేసి మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ ప్రారంభించారు.



కాంగ్రెస్‌లోకి పెద్దంపేట సుభాష్‌నగర్ వాసులు

'ప్రజాహిత' ఎక్కడ పాయె

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహజ సంపదలను దోచుకుంటున్నడంటూ లారీలను అడ్డుకున్న ప్రజాహిత సంస్థ సభ్యులకు ఇప్పుడు అదంతా నీతివంతంగా కనిపిస్తోందా.. అని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య, మాజీ ఎంపీపీ సందనవేన సునీత, మాజీ జెడ్పీటీసీ యాట దివ్య అన్నారు. పెద్దపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు సుభాష్‌రావు, సంపత్, శ్రీనివాస్, స్వరూప ఉన్నారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ అండ

జ్యోతినగర్: కార్పొరేషన్‌లోని 23, 2, 3, 4వ డివిజన్లలో రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాదయాత్ర నిర్వహించారు.

ఆదరించి ఆశీర్వదిస్తే.. సేవకుడిగా పనిచేస్తా

- బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మంథని/మల్హర్/రామగిరి: ఇంటిబిడ్డగా ఆశీర్వదించి.. ఎమ్మెల్యేగా గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. రెండోరోజు బుధవారం రావులపల్లి, మల్లారం, చిన్నతూండ్ల, శాత్రాజ్‌పల్లి, పెద్దతూండ్ల, ఆడ్వాలపల్లి, దుబ్బపేటలో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అభివృద్ధితోపాటు ప్రజాసేవకు అంకితమయ్యామన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే 'మీ బిడ్డల భవిష్యత్ బాధ్యత తీసుకుంటా' అని హామీ ఇచ్చారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్‌బాబు మల్హర్ మండలానికి ప్రభుత్వ కార్యాలయాలు తీసుకు రాకుండా స్థానికులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ప్రజల మనసు దోచుకున్న నాయకుడు దివంగత మాజీ ఎంపీపీ మల్హర్‌రావు అని కొనియాడారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ రామరావు, వైస్ చైర్మన్ ప్రకాశ్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు చంద్రకళ, నాయకులు హరీశ్, పద్మ, విజయ, మమత, రవి, తాజొద్దీన్, యాదగిరిరావు పాల్గొన్నారు.



మల్హర్: మల్లారంలో మాట్లాడుతున్న పుట్ట మధు

గులాబీ జెండా ఎగరడం ఖాయం

2014 అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈసారి మంథనిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని పుట్ట మధు ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ మున్సిపల్ పరిధిలో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

రామగిరి: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. బుధవారం మండలంలోని బేగంపేట, నవాబ్‌పేట గ్రామాల్లోప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు బుర్ర పద్మ, గాజుల ప్రశాంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీ కరుణ పాల్గొన్నారు.



ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ

మృతుడి కుటుంబ సభ్యులకు అభినందన పత్రం

కోల్‌సిటీ: గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన కాటిపెల్లి రాజ్‌కుమార్(38) అనే సింగరేణి ఉద్యోగి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబసభ్యుల అనుమతితో నేత్రాలను సేకరించారు. ఈ క్రమంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడు రాజ్‌కుమార్ పేరుతో సంస్మరణ సభను నిర్వహించారు. రాజ్‌కుమార్ నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించడంపై కుటుంబ సభ్యులను వారు అభినందించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నేత్రదాత తల్లి ప్రమీల, భార్య మహేశ్వరి, అక్కాబావలు స్వరూప–యుగేందర్, సరిత–శ్రీనివాస్, అనిత–సురేశ్, శ్రీలత–రమేశ్, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, నూక రమేశ్, కేఎస్.వాసు, యోగేశ్, బొడ్డు రవీందర్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తానిపర్తి విజయలక్ష్మి, బంక కళావతి, మనోజ్ అగర్వాల్ పాల్గొన్నారు.



అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రఫీక్



కమాన్‌పూర్: కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని గుండారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ రఫీక్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు రఫీక్ కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అన్నాభిషేకం చేశారు. బుధవారం పలువురు వ్యాపారులతో పాటు పారిశ్రామికవేత్తలు పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులందరికీ పూజారి రమేశ్ తీర్థప్రసాదాలు అందించారు.